




# ఈకాలం
HONEST TELUGU DAILY వార్త









## పేదల దరికి...
# పథకాలు!
## ఎమ్మెల్యే అనిల్ తో కలిసి ఏఎంసీ చైర్మన్ బోరంచు చెక్కుల పంపిణీ

**ఈకాలం, ఆదిలాబాద్** తెలంగాణ ప్రభుత్వం అర్హులైన పేదలకు ప్రతిష్టాత్మకంగా నిర్మించి ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను తాంసి మండల కేంద్రంతో పాటు బండల్ నాగపూర్ గ్రామంలో నేడు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పంపిణీ చేశారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇళ్లను నిర్మిస్తూ వారి కళ్ళల్లో ఆనందం నింపుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ అడ్డి భోజరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత శ్రీధర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కౌడాల నారాయణ, బండల్ నాగపూర్ సర్పంచ్ పుష్ప, హౌసింగ్ ఏఈ నషీర్, హౌసింగ్ డీఈ రమేష్, ఎంపిడివో మోహన్ రెడ్డి, తాంసి ఎమ్మార్వో మధుసూదన్, తలమడుగు ఎమ్మార్వో రాజేష్ మోహన్ ,మార్కెట్ కమిటీ మెంబెర్ ధనుంజయ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.






## ఫసల్ బీమా అమలు కోసం అక్టోబర్ 23 నుంచి ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు..
# రైతు పాదయాత్ర!

**ఈకాలం, ఆదిలాబాద్** ఫసల్ బీమా అమలు కోసం అక్టోబర్ 23 నుంచి ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు రైతు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. లేఖర్‌వాడి గ్రామ పంచాయతీలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రంలో ఫసల్ బీమా యోజనను అమలు చేసి రైతులకు పంటల బీమా రక్షణ కల్పించాలనే డిమాండ్‌తో అక్టోబర్ 23 నుంచి ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు పాయల్ శంకర్ ప్రకటించారు. గ్రామ గ్రామాన బాధిత రైతులంతా పాదయాత్రలో పాల్గొని సమస్య పరిష్కారం కోసం పాటుపడాలని విన్నవించారు.



## కార్పొరేషన్ దిశగా..
# ఆదిలాబాద్ మున్సిపాలిటీ!



## ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఈకాలం, ఆదిలాబాద్** ఆదిలాబాద్ మున్సిపాలిటీ భవిష్యత్తులో కార్పొరేషన్‌గా మారే అవకాశం ఉందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఖానాపూర్‌లో యూఏడీఎఫ్ కింద రూ. 10 లక్షలతో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులకు చైర్పర్సన్ అనూష తో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. మంజూరైన పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు ప్రయత్నం చేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ఆదిలాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అందరం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు ఆదిలాబాద్ పట్టణంలో పూర్తవుతాయని, మంచి నీటి సమస్య, మురికి కాలువల నిర్మాణం, అమృత్ పథకంలో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు ఆదిలాబాద్ పట్టణంలో పూర్తవుతాయని, మంచి నీటి సమస్య, మురికి కాలువల నిర్మాణం, తదితర పనులు కొనసాగుతున్నాయని..నిర్మాణాలు పూర్తయితే ఆదిలాబాద్ పట్టణానికి గొప్ప అభివృద్ధి జరుగుతుందని వివరించారు.




# ఈకాలం వార్త

THE HONEST TELUGU DAILY

మంగళవారం 13- 10- 2026 | పేజీలు : 5 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :347 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల




## మోదీజీ. మీ వాళ్లు 200మంది మాతో టచ్‌లో: రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

- రాహుల్ గాంధీ డిమాండ్లు.. సీఈసీ రాజీనామాకు పట్టు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్.
- ఢిల్లీని జైలుగా మార్చారంటూ కేంద్రంపై విమర్శలు.
- సీజేఐ అపాయింట్‌మెంట్ నిరాకరణపై ప్రశ్నలు.
- ఎన్నికల అక్రమాలపై సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్తామని వెల్లడి.
- జ్ఞానేశ్ కుమార్‌పై సుప్రీంలో పిటిషన్ వేస్తామని ప్రకటన.
- ఢిల్లీలో 30 వేల మంది పోలీసుల మోహరింపుపై అభ్యంతరం.



2లో

## విపక్షాల మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు..

రాహుల్ తరపున సుప్రీంలో పిటిషన్



- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ఇండియా కూటమి డిమాండ్.
- రాహుల్ గాంధీ నేతృత్వంలో 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీ.
- ర్యాలీలో ప్రియాంక గాంధీ, ఖర్గే, అఖిలేశ్, రేవంత్‌రెడ్డి తదితరుల పాల్గొనడం.
- భగవాన్ దాస్ రోడ్డు వద్ద బారికేడ్లతో నేతలను అడ్డుకున్న పోలీసులు.

2లో

## రియాద్ విమానాశ్రయంపై క్షిపణిదాడి

కామారెడ్డి వాసికి తీవ్ర గాయాలు



2లో

## చిన్నారి హత్య..

### డీసీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



సికింద్రాబాద్: బొల్లారంలో హత్యకు గురైన చిన్నారి మోజెస్ అరేలియా (5)బంధువుల ఆందోళనతో డీసీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. చిన్నారిని చంపిన నిందితుడు విక్రమ్‌ను తమకు అప్పగించాలని బంధువులు డిమాండ్ చేశారు. నిందితుడి వెంటనే బహిరంగంగా ఉరి తీయాలని విల్లా ఆర్కిడ్ గేటెడ్ కమ్యూనిటీ వాసులు నినాదాలు చేశారు. పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. డబ్బు కోసం ఐదేళ్ల చిన్నారి మోజెస్‌ను.. సెక్యూరిటీ గార్డ్ విక్రమ్ దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. క్లబ్‌హౌస్ దగ్గర ఉన్న చిన్నారిని సెల్లార్‌లోకి తీసుకెళ్లి... కాళ్లు, చేతులు కట్టేసి, శరీరానికి పెద్ద రాయి కట్టి నీటి సంపులో పడేశాడు. చిన్నారి చనిపోయిందని నిర్ధారించుకుని..రాత్రి 7.30 గంటల సమయంలో సెల్లార్ నుంచి ఒక్కడే బయటకు వచ్చి సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడి వెళ్లిపోయాడు.

## భాజపా వ్యతిరేకుల ఓట్లు తొలగించడమే లక్ష్యం: రేవంత్‌రెడ్డి




- SIRతో ప్రజల ఓట్లు తొలగిస్తున్నారని సీఎం ఆరోపణ.
- ఎన్నికల కమిషన్‌ను మోదీ ప్రభుత్వం వాడుకుంటోందని విమర్శ.
- భాజపా వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని సీఈసీకి టాస్క్ ఇచ్చారని వ్యాఖ్య.
- యువత, నిరుద్యోగులు, పేదల ఓట్లే లక్ష్యమని ఆరోపణ.
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శ.
- జనాభా పెరుగుతుంటే ఓటర్ల సంఖ్య ఎందుకు తగ్గిందని ప్రశ్న.
- SIR జరిగిన రాష్ట్రాల్లో భాజపా గెలిచిందని వ్యాఖ్యానించిన సీఎం.

దిల్లీ: రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఓటు హక్కు కల్పించడానికి SIR చేపట్టారని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల ఓట్లను తొలగించడానికే దీనిని వినియోగిస్తున్నారని ఆరోపించారు. దిల్లీలో సీఎం మీడియాతో మాట్లాడారు."మోదీ తన అధికారం నిలబెట్టుకునేందుకు గతంలో ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్‌ట్యాక్స్ విభాగాలను వాడుకున్నారు. ఇప్పుడు వాటితో పని జరగడం లేదని.. ఎన్నికల కమిషన్‌ను వినియోగించుకుంటున్నారు. భాజపా వ్యతిరేకుల ఓట్లు తొలగించేందుకు ప్రస్తుతం SIRను తెచ్చారు. తమ వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు టాస్క్ ఇచ్చారు. ప్రధానంగా భాజపాను వ్యతిరేకించేది.. యువత, నిరుద్యోగులు, పేదలు. వీరి ఓట్లను తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్ చూస్తున్నారు. సీఈసీలో తప్పులు జరిగాయని మిగతా ఇద్దరు ఈసీలు వ్యతిరేకించారు. జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని తేలింది. అలాంటి అధికారిని తొలగించేందుకు మోదీకి అభ్యంతరం ఏమిటి?""సర్ ప్రక్రియ జరగని రాష్ట్రాల్లో భాజపా ఓడిపోయింది. ఈ ప్రక్రియ జరిగిన బిహార్, బెంగాల్‌లో భాజపా గెలిచింది. దేశంలో జనాభా పెరుగుతుంటే ఓటర్ల సంఖ్య కూడా పెరగాలి కదా.. మరి ఎందుకు తగ్గింది?" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.



- సీఎం చంద్రబాబు వర్చువల్‌గా అభివృద్ధి పనులకు శంకుస్థాపన.
- భక్తుల కోసం ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణం.
- నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు.. రోజుకు 15 వేల మందికి వసతి.
- రూ.486 కోట్లతో 4 పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్సులు.
- రూ.311 కోట్లతో 4,500 వాహనాల పార్కింగ్ సదుపాయం.
- రూ.90 కోట్లతో 30 బస్‌బేలతో ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్.

## తిరుపతిలో రూ.3,222

### కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం

- తితిదే ఉద్యోగుల కోసం నివాస లేఅవుట్ అభివృద్ధి.
- తిరుమలపై రద్దీ తగ్గించేందుకు తిరుపతిలో వసతుల విస్తరణ.

అమరావతి: తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీవారి భక్తులకు సౌకర్యాలు కల్పించేలా ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్, తితిదే ఉద్యోగుల సొంతింటి కల సాకారానికి నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆయన శంకుస్థాపన చేశారు. టౌన్‌షిప్‌లో నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు నిర్మించి.. రోజుకు 15 వేల మంది భక్తులకు వసతి సదుపాయాలు కల్పించనున్నారు. రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయం, రూ.90 కోట్లతో 30 బస్‌బేలతో ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ నిర్మాణానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తిరుమల కొండపై రద్దీ తగ్గించేందుకు తిరుపతిలో వసతి సౌకర్యాలను విస్తరించనున్నారు. టౌన్‌షిప్‌లో అత్యవసర వైద్య సహాయ కేంద్రాలు, ఆధునిక భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు.

## నాంపల్లి ఏసీబీ కోర్టులో కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్

హైదరాబాద్: నాంపల్లి ఏసీబీ కోర్టులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఫార్ములా ఈ- కార్ రేసు కేసులో నిందితుల జాబితా నుంచి తన పేరు తొలగించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని న్యాయస్థానం ఆదేశించింది. డిశ్చార్జ్ పిటిషన్‌పై ఈనెల 30న విచారణ చేపడతామని పేర్కొంది. ఈ కేసులో కేటీఆర్ ఏ1గా ఉన్న సంగతి తెలిసిందే.



## బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ..

కోట్ల మంది ప్రజలపై లేదు:




- విద్యుత్ కోతలకు సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యమే కారణమని విమర్శ.
- కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణ.
- దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టుల నుంచి నీటిని లిఫ్ట్ చేయలేదని విమర్శ.
- మరమ్మతుల పేరుతో సింగూరు ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేశారని వ్యాఖ్య.
- ప్రస్తుతం సింగూరులో 3 టీఎంసీలే ఉన్నాయని వెల్లడి.

# సంపాదకీయం

## విశ్వనాథ విస్తృతిని తెలిపే చిన్న కథలు

'వేయిపడగలు' వంటి మహా కృతిని రచించిన కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విశ్వరూపాన్ని అచ్చులో రెండు మూడు పేజీలు మాత్రమే ఉండే కథలలోనూ చూడవచ్చు. 'చిన్న కథలు' పేరుతోనే వెలువడిన సంకలనంలో 31 కథలు కనిపిస్తాయి. లోతైన భావాన్నీ, శాశ్వత సత్యాలనూ అందించడానికి కథానిక కూడా అనువైనదేనని కవిసమ్రాట్ నిరూపించారు. చరిత్ర, సామాజిక పరిణామాలు, స్త్రీపురుష సంబంధాలే కాదు, 'ఇంకొక విధం'గా ఉండే పురుష పురుష సంబంధాలను కూడా ఆయన గమనించారు.

సంస్కరణవాదం చాలా సందర్భాలలో సంస్కర్తల చేతిలోనే భంగపడిందని చెప్పేందుకు ఎన్నో దృష్టాంతాలు కనిపిస్తాయి. జాలీ దయల గురించి ఉపన్యాసాలు దంచేవారు ఆచరణలో వాటికి కాస్త దూరంగానే ఉంటారని చెప్పినా అతిశయోక్తి కాదు. ఆ విషయంలో సిద్ధాంతం, ఆచరణ రైలు పట్టాల వంటివి. ఎక్కడా కలియలేవు. మనుషులలోని ఈ భేషజాలను, దంద్వ వైఖరిని అత్యంత లాఘవంగా చిత్రించిన కథ 'మాక్లీదుర్గంలో కుక్క'. గుంతకల్లు--బెంగళూరు మార్గంలో ఉన్న చిన్న రైల్వేస్టేషన్ మాక్లీదుర్గం. అక్కడే బతుకుతూ ఉంటుంది ఓ మగ ఊరకుక్క. బెంగళూరు వెళుతున్న ఓ 'పెద్దమనిషి' ఆ స్టేషన్‌లో దిగాడు. వెంట ఒక ఆడ సీమకుక్క ఉంది. ఊరకుక్కకీ, సీమకుక్కకీ 'ప్రథమ దర్శనంలోనే ప్రణయం' ఏర్పడింది. సీమకుక్కను కటకటాలకు కట్టేసి, పెద్దమనిషి సామగ్రి తూకం వేయించడం పనికి దేనికో లోపలికి వెళ్లాడు. స్టేషన్ మాస్టర్ చదువుకున్నవాడు కావడంతో ఆ పెద్దమనిషితో సిద్ధాంత రాద్ధాంత చర్చకు దిగాడు. విషయం-- వర్ణ వ్యవస్థ. స్టేషన్ మాస్టర్ ఉండాలంటాడు.

పెద్దమనిషి దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. పతాక సన్నివేశంలో 'అయితే మీరు వర్ణ వ్యవస్థను తీసిపారవేయాలి అంటారా?' అన్నాడు స్టేషన్‌మాస్టర్. పెద్దమనిషి ఎలాంటి శషభిషలు లేకుండా 'తీసివెయ్యాలంటాను. ఈ వ్యవస్థ మూలంగా అనేక భేదాలేర్పడుతున్నవి. కొందరనవసరంగా తాము గొప్పవాళ్లమనుకుంటున్నారు. తక్కువ కులాల మీద అధికారం చెలాయిస్తున్నారు. వర్ణాంతర భోజనములూ, వివాహములు జరగవలె. అప్పుడే దేశానికి ముక్తి' అంటూ ప్రకటించాడు. ఇంకో అడుగు ముందుకు వేసి, 'మనవాళ్లు (పెద్దలు) సంఘానికి చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు' అని ముక్తాయించి బయటకు వచ్చాడు. అక్కడి దృశ్యం ఏమిటి? సీమకుక్క ఊరకుక్కను కలుసుకున్నది. సీమకుక్క 'వర్గభేదం' మరచిపోయినందుకు అప్పటిదాకా అంతా సమానమని ఘోషించిన పెద్దమనిషి ఆనందించలేదు. సరికదా, పట్టలేనంత ఆగ్రహంతో తన దగ్గరున్న కర్రతో ఊరకుక్కని చావగొట్టాడు. సీమకుక్కకి నాలుగు మాత్రమే వడ్డించాడు. తన తోలుపెట్టె తెరిచి తువాళ్లు, సబ్బు తీసి వెంటనే అభ్యంగనం చేయించాడు. విషయం ఏమిటంటే, తన 'జాతిగల' సీమకుక్క రుతువుకు వచ్చింది. తగిన జంటను చూద్దామని కుక్కతో సహా ఆయన బెంగళూరు వెళుతున్నాడు. మధ్యలో ఈ సంకరం జరిగిపోయింది. దాని బొచ్చు, కుచ్చుతోక, ముఖం మీద మచ్చ చూశాక, అది పిల్లలు పెడితే తనకి ఒకటి ఇమ్మని స్టేషన్‌మాస్టర్ కోరాడు. దీనికి కొనసాగింపు-- ఇద్దరు విద్యార్థుల సంభాషణ. స్టేషన్‌లో ఉన్న మిఠాయి దుకాణంలో ఏదో కొని, తింటూ మాట్లాడుకుంటూ ఉంటారు. ఎవరికీ దయాదాక్షిణ్యాలు లేవన్నది వారు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇంతలో ఆ ఊరకుక్క వాళ్ల దగ్గరికి వచ్చి తోక ఊపుతుంది.

కాస్తయినా విదిలించలేదు సరికదా, ఒకడు బూటు కాలితో డొక్కలో తన్నాడు. తల్లడిల్లిపోయింది కుక్క. అదే మిఠాయి దుకాణం వాడు పడేసినదేదో తిని కుక్క జబ్బు పడిపోయింది. నెల్లాళ్లకి ఒకసారి మాత్రమే మార్చే నూనెలో తయారై వచ్చిన మిఠాయి అది. పైగా ఈసారి ఈ దౌర్భాగ్యపు ఊరకుక్క కనిపిస్తే నరికి చంపేయాలని ప్రతిన పూనిన పెద్దమనిషి ఆశ నెరవేరకుండా చనిపోయింది కూడా. కొన్నాళ్లకి మళ్లీ పెద్దమనిషి ఆ స్టేషన్‌లో దిగాడు. కుక్కని బెంగళూరు తీసుకుపోయాడు కానీ, అది అవతలి జాతికుక్కతో కలయికకు అంగీకరించలేదు. పైగా 'మీ కుక్క' తన కుక్కను పాడు చేసిందని, ఫలితంగా రెండు పిల్లలు పుట్టాయని, వాటికి ఊరకుక్కల పోలికే దాపురించిందని వాపోయాడు. ఒక పిల్ల చచ్చిపోయింది. రెండో దానిని స్టేషన్ మాస్టర్‌కి ఇచ్చి వదిలించుకున్నాడు. కానీ దీనికి తీవ్రమైన మనుష ద్వేషం. తండ్రి మాదిరిగానే అది స్టేషన్‌లోనే బతుకుతూ ఉంటుంది. సిద్ధాంతాల రాద్ధాంతాలతో ఊకదంపుడు మాటలు మాట్లాడేవాళ్లంటే మరీ కోపం. ఇలా ముగించారు కథ. సున్నిత హాస్యంతో నడిచే ఈ కథలో మిఠాయి దుకాణం వర్ణనలు, నెలకోసారి మాత్రమే మార్చే నూనెతో చేసిన వంటకాల గురించి విశ్వనాథ రమణీయంగా చెప్పారు. అన్నట్టు ఈ దుకాణం మీద కూడా కొత్త ఊరకుక్కకి అసహ్యం. ఎందుకంటే అందులోవి తినే తన తండ్రి కుక్క తీసుకుని తీసుకుని పోయింది. ఈ కథను 1936లో రచించారు.

విశ్వనాథ వారి ప్రాపంచిక దృష్టికి, విప్లవాల పేరిట సముద్రపు కెరటాల మాదిరిగా ఎగసి, ఊహకు అందనంత అసబద్ధంగా విప్లవ ఫలితాలు ఛిద్రమవుతాయో గమనించారని చెప్పడానికి ఉదాహరణ 'సప్తాశ్వము' కథ. ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన కొన్ని ప్రపంచ దేశాల విప్లవ గమనాలను విశ్వనాథ ఒక దుఃఖంతో చిత్రించారనిపిస్తుంది. కొందరు కలసి ఒక విప్లవం తెచ్చారు. కొన్ని కారణాలతో డామట్ అనే విప్లవనేతను వారిలోనే ఎవరో హత్య చేశారు. అందుకు ఏడుగురిని బాధ్యులను చేసి మరణదండన విధించారు. వీరే ఒక్కొక్కరు విప్లవ పంథాలలోని శూన్యాన్నీ, ఆధిపత్య ధోరణులనీ, చంపడం కొనసాగిస్తేనే విప్లవానికి మనుగడ పేరుతో ఆ క్షణపు విజేతలు తీర్చుకునే రక్తదాహాన్నీ వివరించి చెబుతారు. ఇవాళ మీరు అధికారం హస్తగతం చేసుకున్నారు కాబట్టి మమ్మల్ని బోను ఎక్కించారు. నిన్న మనమంతా కలసి అధికారంలో ఉన్నప్పుడు కొందరికి ఉరి బిగించాం. రేపు వేరొకరు మీకు ఇలాంటి ముగింపే రాస్తారు అని శపిస్తారు. ఇలాంటి పరిణామాలనూ, విప్లవ ఫలితాలనూ సమీప గతంలోనే మనం గమనించాం. ఇది తెలుగు కథలలోనే ఒక విశిష్ట ప్రయోగమనిపిస్తుంది.

ఇరవయ్ దశకంలో రాసిన 'ఇంకొక విధము' విశ్వనాథ సునిశిత రచనా సామర్థ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. స్వలింగ సంపర్కులు, మనో విజ్ఞానశాస్త్రం వంటి పదాలు పెద్దగా ప్రాచుర్యం పొందని కాలంలో ఆయన స్వలింగ సంపర్కం మీద విశిష్టమైన కథను అందించారు. అచ్చులో రెండు పేజీలు కూడా పూర్తిగా ఉండని ఈ కథ చాలా పెద్ద కాన్వాస్‌ను ఇముడ్చుకుని కనిపిస్తుంది. ముప్పయ్ ఏళ్ల గోపీనాథుడు, పదిహేనేళ్ల మలయగిరి మధ్య 'ఇంకొక విధం' అనదగిన బంధానికి విశ్వనాథ అక్షరరూపం ఇచ్చారు. ఈ ఇద్దరూ రంగస్థల నటులు. ఇరువురికి దేహములు మాత్రమే రెండు అన్నారు రచయిత. పారిజాతాపహరణ నాటకం ప్రదర్శించాలి. గోపీనాథుడు కృష్ణుడు. మలయగిరి సత్యభామ. కానీ మలయగిరి విఫలమవుతాడనే అనుకున్నాడు గోపీనాథుడు. కానీ వారి నటన గురించి ఎవరి నోట విన్నా ఒక్కటే మాట, 'భార్యాభర్తల అనురాగం మాదిరిగానే ఉన్నది.' ఈ ముగింపు కోసం విశ్వనాథ కథనాన్ని, అంటే ఆ ఇద్దరి మధ్య విచిత్ర బంధాన్ని చాలా గొప్పగా చిత్రించారు.

స్త్రీపురుష సంబంధాన్ని విశ్వనాథ సమదృష్టితోనే చూశారు. దానిని నిరూపించేదే 'భావనాసిద్ధి' (1923) కథ. భర్త వస్తే లేచి నిలబడనక్కరలేదనే చెప్పగలిగిన లక్ష్మణస్వామి భార్య ఊర్మిళ. తాను లక్ష్మణస్వామి కంటే చక్కని దాననని ఆమె నమ్మకం.

# చిన్నారి హత్య.. డీసీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

### హత్య చేసింది విక్రమ్ ఒక్కడే: సీపీ సుమతి

సెల్‌ఫోన్ సిగ్నల్స్, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించినట్లు సీపీ సుమతి మీడియాకు వెల్లడించారు. "నిందితుడి కోసం 10 బృందాలు గాలించాయి. క్లబ్‌హౌస్ సెల్లార్‌లోని సంపులో చిన్నారి మృతదేహాన్ని గుర్తించాం. సెక్యూరిటీ గార్డుగా పని చేసి.. మానేసిన విక్రమ్‌కుమార్‌ను అనుమానించాం. చిన్నారిని కిడ్నాప్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేయాలని విక్రమ్ భావించాడు. చిన్న కుటుంబం, ధనిక కుటుంబం కాబట్టి డబ్బులు ఇస్తారని అనుకున్నాడు. చిన్నారిని బయటకు తీసుకెళ్లే అవకాశం లేదు కాబట్టి ముందే చంపేశాడు. హత్యలో మరెవరికీ ప్రమేయం లేదు. విక్రమ్ కుమార్ ఒక్కడే చేశాడు. చిన్నారిని చంపి సంపులో వేశాకే డబ్బుల కోసం తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు" అని డీసీపీ సుమతి వెల్లడించారు.

# బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ..

## కోట్ల మంది ప్రజలపై లేదు: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యం వల్లే రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు (ఋతీఅంష్ట ఋశీ) విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కారణంగా రైతులు ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్ మీడియాతో మాట్లాడారు."రైతుల కంటే ముఖ్యమైన అంశం ప్రభుత్వానికి ఏమి ఉంటుంది..? దేవాదుల, కల్వకుర్తిలో నీళ్లు లిఫ్ట్ చేసి ఉంటే కరవే ఉండేది కాదు. ఎల్‌నినో ఉందని ముందే తెలిసినా.. నీళ్లు లిఫ్ట్ చేసి పెట్టుకోలేదు. సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తామని 29 టీఎంసీలు ఖాళీ చేశారు. పనులు చేయకుండా ప్రాజెక్టును వదిలేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు తాగునీరు ఎలా? కోట్ల మందికి తాగునీరిచ్చే ఈ ప్రాజక్టు పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారు? ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టులో 3 టీఎంసీలే ఉన్నా.. బీరు ఫ్యాక్టరీలకు నీళ్లిస్తున్నారు. బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ.. కోట్ల మంది ప్రజలపై లేదు. లిక్కర్ కంపెనీలకు నీటి కొరత రావొద్దని ఆబ్కారీ మంత్రి చెబుతున్నారు. తాగునీటిని బీరు కంపెనీలకు ఇస్తోన్న మిమ్మల్ని ఏం చేయాలి" అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# రియాద్ విమానాశ్రయంపై క్షిపణిదాడి.. కామారెడ్డి వాసికి తీవ్ర గాయాలు

మొదటిపేజీ తరువాయి

రియాద్: సౌదీ అరేబియాలోని రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం జరిగిన క్షిపణి దాడుల్లో కామారెడ్డికి చెందిన 36 ఏళ్ల షేక్ సయీద్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. రియాద్‌లోని కింగ్ ఫహద్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. కామారెడ్డిలోని సైనీ బాబా కాలనీకి చెందిన షేక్ సయీద్ సుమారు 12 ఏళ్లుగా సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. కొన్నేళ్లుగా రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని స్టార్‌బక్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దాడిలో 13 మందికిపైగా మృతి చెందగా.. దాదాపు 300 మందికి గాయాలైనట్లు తెలుస్తోంది.

# తామరపూల కోసం దిగి ఇద్దరు విద్యార్థుల మృతి



నాగులుప్పలపాడు: తామర పూల కోసం చెరువులో దిగి ఇద్దరు బాలురు మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కొలకలూరి నిశాంత్(12), కండ్లగుంట నాగచైతన్య స్థానిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. దసరా సెలవులు కావడంతో.. ఆడుకుంటూ చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ తామర పూల కోసం నీటిలో దిగారు. ప్రమాదవశాత్తూ మునిగిపోయి మృతి చెందారు. అటుగా వెళ్తున్న స్థానికులు చెరువులో చూడగా ఓ బాలుడి తల నీటిలో తేలుతూ కనిపించింది. వెంటనే చెరువులో దిగి అతడిని బయటకు తీయగా.. అతడి చేయి పట్టుకుని ఉన్న మరో బాలుడి మృతదేహం కూడా లభ్యమైంది. ఇద్దరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# తిరుమల నవరాత్రి బ్రహ్మోత్సవాలు.. బంగారు తిరుచ్చిపై శ్రీవారి వైభవం

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవం జరుగుతున్నాయి. సోమవారం ఉదయం బంగారు తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉభయదేవేరులతో మాడవీధుల్లో బంగారు తిరుచ్చిపై మలయప్పస్వామిని ఊరేగించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పెద్దశేషవాహన సేవ ఉంటుంది. ఈనెల 16న శ్రీవారి గరుడ వాహనసేవను సాయంత్రం 6.30 గంటలకే భక్తుల సౌకర్యార్థం ప్రారంభించనున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉండటంతో.. అందుకు అనుగుణంగా తితిదే ఏర్పాట్లు చేస్తోంది.



# మోదీజీ.. మీ వాళ్లు 200మంది మాతో టచ్‌లో: రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపించేందుకు కాంగ్రెస్ పార్టీ సోమవారం సుప్రీం కోర్టు వరకూ భారీ ర్యాలీకి తలపెట్టింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ (ఋష్ట్రబశ్రీ ఊఅంఎష్ట్రఱ) ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి పలు ప్రశ్నలు సంధించారు. నిరసనల వేళ దిల్లీని ఎందుకు జైలుగా మార్చారని ప్రశ్నించారు. 'ఓట్ల చోరీ' అంశాన్ని లేవనెత్తేందుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అపాయింట్‌మెంట్ కోరినా అనుమతి లభించని విషయాన్ని ఆయన ప్రస్తావించారు. సీజేఐని ఎవరు నిర్దేశిస్తున్నారని అడిగారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నుంచి తనకు సందేశాలు వస్తున్నాయని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. "ఆయన ఎంత ఒత్తిడిలో పనిచేస్తున్నారో మేం అర్థం చేసుకోగలం. ఇకనైనా అప్రూవర్‌గా మారి రాజీనామా చేయండి. అదే మీరు దేశానికి చేసే నిజమైన సేవ. అప్పుడు మేం క్షమిస్తాం" అని కాంగ్రెస్ ఎంపీ పేర్కొన్నారు.

రాహుల్ బృందానికి సీజేఐ అపాయింట్‌మెంట్ నిరాకరణ!

దిల్లీని జైలుగా మార్చారెందుకు..?

"భాజపా కు దేశ ప్రజల్లో 12 ఏళ్లుగా వ్యతిరేకత ఉంది. ఇప్పుడది ఒక స్పష్టమైన రూపం దాల్చుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల వేళ దిల్లీలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. నగర రోడ్లపై దాదాపు 30వేల మంది పోలీసులను మోహరించారు. దేశ రాజధానికి రాకుండా అడ్డుకుంటున్నారు. మొత్తం దిల్లీ ని కోటగా, జైలుగా మార్చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆర్ఎస్ఎస్ గూండాలకు ఉన్న స్వేచ్ఛ.. యువతకు ఎందుకు లేదు? మహిళలపై భాజపా, ఆర్ఎస్ఎస్ గూండాలు దాడులు చేస్తున్నారు. ప్రస్తుత పరిణామాలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని మాకు తెలుసు. ఆయన రాజీనామా చేయాల్సిందే. అప్పటివరకు మేం వదిలిపెట్టబోం" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

### సుప్రీంకు వెళ్తాం..

"దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని.. భారత ప్రధాన న్యాయమూర్తికి చెప్పాలని భావించాం. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను సీజేఐ దృష్టికి తీసుకెళ్లాలనుకున్నాం. అందుకోసమే ఆయన అపాయింట్‌మెంట్ కోరాం. కానీ, మా విజ్ఞప్తిని సీజేఐ తిరస్కరించారు. సుప్రీం కోర్టులో పిటిషన్ వేసుకోవాలని అన్నారు. అందుకే నేడు అత్యున్నత న్యాయస్థానం వరకు ర్యాలీగా వెళ్తున్నాం. జ్ఞానేశ్ కుమార్‌పై సుప్రీంలో పిటిషన్ వేస్తాం" అని రాహుల్ వెల్లడించారు.

"ప్రస్తుతం ప్రజలు, ప్రతిపక్షాలన్నీ ఒకవైపు ఉంటే.. మోదీ, అమిత్ షా, అజిత్ ధోబాల్, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భాగవత్ మరోవైపు ఉన్నారు. వారు ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నారు. మోదీకి నేను చెప్పేది ఒక్కటే.. మీ ప్రభుత్వంలోని 200 మంది అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు. ఇది మోదీ-రాహుల్ మధ్య జరిగే యుద్ధం కాదు. దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం జరుగుతున్న పోరాటం. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ఆ ఐదుగురు నేరగాళ్లు న్యాయవిచారణ ఎదుర్కొనే వరకు వదిలిపెట్టేది లేదు" అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# విపక్షాల మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు..

మొదటిపేజీ తరువాయి

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపిస్తూ సుప్రీంకోర్టు వరకు మార్చ్‌కు పిలుపునిచ్చింది విపక్ష ఇండియా కూటమి. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రతిపక్ష నేతలు ఈ ర్యాలీ చేపట్టారు. వీరి మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నారు.

'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో విపక్ష ఎంపీలు, నేతలు ఈ ర్యాలీ చేపట్టారు. ఓటు చోరీ అంశంతో పాటు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు లో స్వయంగా పిటిషన్ దాఖలు చేసేందుకు రాహుల్ బృందం బయల్దేరింది. విపక్ష నేతలు ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, తేజస్వీ యాదవ్, అఖిలేశ్ యాదవ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, శశి థరూర్, సచిన్ పైలట్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు.

మోదీజీ.. మీ వాళ్లు 200మంది మాతో టచ్‌లో: రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

వీరికి మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అయితే, భగవాన్ దాస్ రోడ్డు వద్ద బారికేడ్లు పెట్టి విపక్ష నేతలను నిలువరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఒకింత ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు..

మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది. రాహుల్ గాంధీ ర్యాలీలోనే ఆగిపోవడంతో న్యాయస్థానానికి రాలేకపోయారు. దీంతో ఆయన తరఫున న్యాయబృందమే పిటిషన్ దాఖలు చేసింది.

అంతకుముందు, 'ఓట్ల చోరీ' అంశాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌వద్ద లేవనెత్తాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు తమకు సమయం ఇవ్వాలని సీజేఐని అభ్యర్థించింది. అయితే, ఇందుకు సీజేఐ తిరస్కరించారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న అంశాన్ని విపక్షాలతో చర్చిస్తే.. అది చట్టవిరుద్ధమే అవుతుందని జస్టిస్ సూర్యకాంత్ విపక్షాలకు లేఖ రాశారు.

# 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో శ్రీశైలం జలశయానికి స్థానం



శ్రీశైలం ఆలయం, సున్నిపెంట సర్కిల్: శ్రీశైలం జలాశయానికి అరుదైన గుర్తింపు లభించింది. శ్రీశైలం డ్యాం విశిష్టతలను లండన్‌కు చెందిన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థ గుర్తించింది. ఆ సంస్థ సౌత్ జోన్ జాయింట్ సెక్రటరీ ఇలియాజర్ సున్నిపెంట చేరుకుని జలవనరుల శాఖ, ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారుల సమక్షంలో 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సర్టిఫికెట్‌ను శ్రీశైలం ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డికి అందజేశారు. ఈ ప్రాజెక్ట్‌కు ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చేలా కృషి చేసినందుకు సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్మాణ శైలి, హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ జనరేషన్ విధానంతో పాటు 2009 వరదల్లో 25 లక్షల క్యూసెక్కుల వరదను డ్యాం తట్టుకోవడం వంటి అంశాలను 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థ పరిగణలోకి తీసుకుందన్నారు. ఈ గుర్తింపుతో జలవనరులశాఖ అధికారులకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున, సీఎం చంద్రబాబు తరఫున వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణికి మూడు ఫిర్యాదులు..

ఈకాలం



నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల స్థాయిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో రఫీ అహ్మద్ తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రావు, విద్యాశాఖ అధికారి రాములు, ఎంపీఓ తరచంద్, హౌసింగ్ ఏఈ అనూష, ఏవో నరసయ్య, ఏపీఎం సువర్ణతో పాటు వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్ ఎడమ కాలువకు 6,000 క్యూసెక్కుల నీటి విడుదల



ఈకాలం

నాగార్జునసాగర్ ఎడమ కాలువకు 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఎన్నెస్పీ (చీఫ్రా) అధికారులు తెలిపారు. కాలువ ద్వారా నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి విషయంలో ఊరట లభించనుంది. నీటి విడుదలపై రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ట్రాఫిక్ కు ఇబ్బందిగా మారిన చెన్నై షాపింగ్ మాల్

ఈకాలం



ఆర్మూర్ లో కొత్త బస్టాండ్ ఎదుట షాపింగ్ మాల్ ను ఏర్పాటు చేశారు. కానీ ప్రజలకు చాలా ఇబ్బంది కరంగా ఉంది. వాహనాలు, బైక్లు, ప్రభుత్వ వాహనాలు, బస్సులు, కార్లు, కాళీ నడక చేసే ప్రజలు చాలా ఇబ్బందికరంగా ఉంది. కొత్త బస్టాండ్ నుండి పిసా మల్లన్న గుడి వరకు ట్రాఫిక్ జామ్ అవుతుంది. ప్రజలు ఆందోళన చెందుతున్నారు. షాపింగ్ మాల్ పెడితే ఊరు బయట పెట్టాలని అని బస్టాండు ముందట నిర్వహించారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## గాయత్రి దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

ఈకాలం



సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో శ్రీదేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఈరోజు తెలంగాణ చౌరస్తాలో అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో మంగళాహారతులతో నైమిద్యాలతో పూజలు నిర్వహించారు.

## దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తుండు

– ఆయనకు మద్దతుగా మనమందరం వీధుల్లోకి రావాల్సిందే జగ్గారెడ్డి పిలుపు

ఈకాలం



మన అధినేత రాహుల్ గాంధీ ఢిల్లీ రోడ్ల పై ఉంటే మనం ఇళ్లలో పడుకోవడం కరెక్టేనా రాహుల్ గాంధీ పోరాటానికి కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు దేశ ప్రజలందరూ మద్దతు ఇవ్వాలి దేశం లో ఓట్ చోరీ జరుగుతుంది. బీజేపీ ప్రజల హక్కులను కాలరాస్తోంది ఇదే విషయాన్ని ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త మరో పదిమందికి ప్రచారం చేయాలి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు రాహుల్ గాంధీ పోరాటం ఆపబోనని ప్రకటించారు ఆయన డిమాండ్ నెరవేరేవరకు ఆయనకు మద్దతు గా సంగారెడ్డి లో నా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది సంగారెడ్డి లో రాహుల్ గాంధీకి మద్దతుగా జరిగిన భారీ ర్యాలీలో స్పష్టం చేసిన జగ్గారెడ్డి

32

## ప్రత్యామ్నాయ పంటల సాగుతో అధిక ఆదాయం..

–నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఈకాలం

వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటూ, పంటల వైవిధ్యం, సహజ వ్యవసాయ పద్ధతులు, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వరికి బదులుగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టాలు సగటున నాలుగు మీటర్ల మేర తగ్గాయని పేర్కొన్నారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగిస్తూ కంది, పెసర, మినుములు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, జొన్న, మొక్కజొన్న వంటి పంటలను నేల స్వభావం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలని సూచించారు. జిల్లాలోని 72 రైతు వేదికల్లో నిర్వహించిన సమావేశాల్లో సుమారు 5,000 మంది రైతులు, 200 మంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు. సమగ్ర వ్యవసాయంతో అదనపు ఆదాయం పంటల వైవిధ్యం, సహజ వ్యవసాయ పద్ధతులతో తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం పొందవచ్చని రైతు శ్రీకాంత్ తన అనుభవంతో నిరూపిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. మూడు ఎకరాల్లో పసుపు, ఉల్లిగడ్డ, కూరగాయలు, పెసర్లు, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటలను సాగు చేస్తూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు పొలంలో నీటి కుంటను ఏర్పాటు చేసుకోవడంతో పాటు, నేల సారాన్ని పెంచేందుకు పెసర్లను పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. అర ఎకరంలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ ద్వారా మొదటి ఏడాది రూ.1.50 లక్షలు, రెండో ఏడాది రూ.3 లక్షలు, మూడో ఏడాది నుంచి సుమారు రూ.5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నట్లు రైతు శ్రీకాంత్ వెల్లడించారని కలెక్టర్ తెలిపారు. పామాయిల్‌తో పాటు అంతర పంటల సాగు గాంధారి మండలం గుడిమెట్ గ్రామానికి చెందిన ఓ రైతు పామాయిల్ సాగుతో పాటు అంతర పంటలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారని కలెక్టర్ వివరించారు. గతంలో 15 ఎకరాల్లో సోయాబీన్, మొక్కజొన్న, వరి సాగు చేసిన ఆ రైతు, 2023 జూన్‌లో పామాయిల్ సాగు ప్రారంభించినట్లు తెలిపారు. పామాయిల్ తోటలో మొదటి ఏడాది పత్తి, మునగ, రెండో ఏడాది మునగ, కంది సాగు చేయగా, ప్రస్తుతం మూడో ఏడాది బంతిపూల సాగు చేపట్టినట్లు పేర్కొన్నారు. మొదటి కోతలో మూడు క్వింటాళ్ల వరకు పామాయిల్ దిగుబడి వచ్చిందని, పంట విక్రయించిన మూడు, నాలుగు రోజుల్లోనే




డబ్బులు ఖాతాలో జమ కావడం సంతృప్తినిచ్చిందని రైతు తెలిపినట్లు వివరించారు. నీటి వసతి తగ్గడంతో గతంలో నాలుగు నుంచి ఐదు ఎకరాల్లో సాగు చేసిన వరిని ప్రస్తుతం ఇంటి సమీపంలోని ఒక ఎకరానికే పరిమితం చేసినట్లు, రానున్న యాసంగిలో ఆ ఎకరంలోనూ వరికి బదులుగా మునగ సాగు చేయాలని నిర్ణయించినట్లు రైతు వెల్లడించారు. రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపడుతూ నీటి సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ, పంటల వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీమాయాల లక్ష్మి, కామారెడ్డి ఏఎంసీ చైర్మన్ ధర్మగోని లక్ష్మి, వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, తహసీల్దార్ హిమబిందు, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, రైతులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హామీలు ఇచ్చినా పనులు మొదలుకాలేదు.. ప్రశ్నిస్తే కమిషనర్ అసహనం..

–టెండర్ రద్దు అయ్యిందని ఫోన్ లో వివరించిన షబ్బీర్ అలీ

–రీ టెండర్ చేస్తాం అని తెలిపి కాపీ ఇస్తా.. నా ఛాంబర్ లోకి రండి అని లోపలికి వెళ్ళిన కమిషనర్

–22వ వార్డు నివాసితులతో ఆయన మాట్లాడిన తీరు చర్చనీయాంశంగా మారింది

ఈకాలం

కామారెడ్డి పట్టణంలోని రాజీవ్‌నగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరిన కాలనీవాసులకు మున్సిపల్ కమిషనర్ పర్వతాల నుంచి అసహనం ఎదురైంది. రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన 22వ వార్డు నివాసితులతో ఆయన మాట్లాడిన తీరు చర్చనీయాంశంగా మారింది. 'పనులు చేస్తామని చెప్పాను కదా.. మళ్లీ ఈ డ్రామాలేంటి?' అంటూ కమిషనర్ వ్యాఖ్యానించడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్‌నగర్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. నిధులు మంజూరై ఎనిమిది నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంతో అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ప్రజావాణి కార్యక్రమం ముగిసిన అనంతరం అక్కడికి వచ్చిన కమిషనర్ పర్వతాలు, టెండర్ రద్దు కావడం వల్లే పనుల్లో జాప్యం జరిగిందని వివరించారు. తిరిగి ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు నిర్వహించి పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ఫోన్ చేసి కాలనీవాసులతో మాట్లాడించారు. అయితే, కమిషనర్ సూచన మేరకు ఆయన ఛాంబర్‌కు వెళ్లిన కొందరు కాలనీవాసులకు మరోసారి అసహనకర పరిస్థితి ఎదురైంది. 'అక్కడే మాట్లాడాను కదా.. మళ్లీ ఎందుకొచ్చారు?' అని కమిషనర్ అనడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం బయటకు వచ్చిన కమిషనర్‌ను కాలనీవాసులు తమ సమస్యలపై నిలదీయగా, 'నాకేం పనులు లేవనుకుంటున్నారా? మీ కోసమే ఉంటానా? మళ్లీ ఈ డ్రామాలేంటి?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమస్యలు చెప్పుకుంటే డ్రామాలా? తమ ఇబ్బందులను



పరిష్కరించాలని కోరడం తప్పా అని కాలనీవాసులు ప్రశ్నించారు. నెలల తరబడి ఎదురుచూస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను ఓపికగా విని పరిష్కరించాల్సిన అధికారులు ఇలా మాట్లాడటం సరికాదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజీవ్‌నగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

13

## జాకోరా గ్రామంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు..

–ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

ఈకాలం

వర్ని మండలం జాకోరా గ్రామంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ రామదూత దేవి మండలి ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన అమ్మవారిని పోచారం శ్రీనివాసరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో జాకోరా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు,



# ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ మార్చ్‌లో పాల్గొన్న ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్

**– ఓటు హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీలో నిరసన**

**– ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్**

ఈకాలం

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, ఓటు హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎన్ ఎస్ యూ ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, ఎన్ ఎస్ యూ ఐ



నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన నినాదాలు చేశారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చూడాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పాటించాలని, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఆ హక్కును పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు విద్యార్థులు, యువత ప్రజాస్వామ్యబద్ధంగా తమ గళాన్ని వినిపించాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం విద్యార్థి ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని, ఓటు హక్కుల పరిరక్షణ కోసం ఎన్ ఎస్ యూ ఐ ఎల్లప్పుడూ ముందుంటుందని అజ్మీర సురేష్ నాయక్ స్పష్టం చేశారు.

# ఉద్యమకారులను కంటిరెప్పల కాపాడుకుంటా నాగూర్ల వెంకటేశ్వర్లు

**– రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు**



ఈకాలం

తెలంగాణ ఉద్యమకారులను కంటిరెప్పల కాపాడుకుంటానని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు తెలిపారు ఆత్మకూరు మండలంలోని హౌజ్ బుజుర్గ్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు నీలం కుమార్ తండ్రి నీలం సారయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి వారి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి ఆర్థిక సాయం అందజేశారు పరకాల నియోజకవర్గం లోని తెలంగాణ ఉద్యమకారులందర్నీ కాపాడుకుంటానని వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నానని ఉద్యమకారులకు ఏమైనా కష్టాలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని పరకాల నియోజకవర్గ ఉద్యమకారులు అందరికీ ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుషడ్ల సదానందం జిల్లా యూత్ కార్యదర్శి వంగేటి ప్రభాకర్ ,ఆత్మకూరు మండల అధ్యక్షులు ఎండి బాబుమియా (చిరు) అంకతి రవి, భాష బోయిన సాగర్, హుస్సేన్, శంకర్, ముత్యాల మహేందర్ తదితరులు అందరు పాల్గొన్నారు.

# రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం

ఈకాలం

మండలంలో ని జగన్నాధపురం, ములకలపల్లి,పూసుగూడెం రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ యాసంగిలో వరి వేసుకోవొద్దు అని సూచించారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎల్ ని నో తీవ్రత దృష్ట్యా భూగర్భ జలాలు తగ్గుతున్నాదున పంటల సాగు వనరుల అందుబాటున బట్టి చేయాలని సూచించారు. తెలంగాణ చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు మాట్లాడుతూ అన్ని వ్యవసాయ, ఉధ్యాన, పశు సంవర్ధక, విద్యుత్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేసి పౌరులకు ఎల్ ని నో నుండి ఉపశమనం పొందెల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్. జగన్నాధపురం రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమాన్ని హాజరు అయ్యారు మరియు రైతులు ప్రభుత్వ ఆదేశానుసారం ఆరుతడి పంటలు, ఆయిల్ పామ్ మరియు కూరగాయల సాగు చేసుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యమానికి అడిషనల్ కలెక్టర్ విద్య చందన. జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు , సహాయ వ్యవసాయ సంచాలకులు రవి కుమార్ , మండల వ్యవసాయ అధికారి



అరుణ్ బాబు, తహసీల్దార్ స్వాతి బిందు, ఏఈఓలు, వివిధ జిల్లా మరియు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మద్దిశెట్టి సామేలు నివాసానికి సినీ ప్రముఖుల రాక

**– మద్దిశెట్టి సామేలు నివాసంలో సినీ ప్రముఖులురియల్ స్టార్ హీరో అప్సర్ ఆజాద్, ప్రముఖ దర్శకులు జితేంద్ర యాదగిరి రాక!**

ఈకాలం

త్వరలో తెరకెక్కనున్న నూతన చిత్రం లొకేషన్ల పరిశీలనలో భాగంగా మద్దిశెట్టి సామేలు నివాసానికి సినీ ప్రముఖుల రాక. అశ్వరావుపేట నియోజకవర్గం సరోజినీ పురం గ్రామంలో మద్దిశెట్టి సామేలు నివాసానికి ప్రముఖ సినీ హీరో రియల్ స్టార్ అప్సర్ ఆజాద్ , ప్రముఖ దర్శకులు జితేంద్ర యాదగిరి , తమిళనాడు రాష్ట్రానికి చెందిన చిన్నదొర స్వామీజీ విచ్చేశారు. త్వరలో తెరకెక్కనున్న నూతన చిత్రానికి సంబంధించిన షూటింగ్ లొకేషన్ల పరిశీలన కోసం హీరో అప్సర్ ఆజాద్ , దర్శకులు జితేంద్ర యాదగిరి , చిన్నదొర స్వామీజీ మద్దిశెట్టి సామేలు నివాసానికి



చేరుకున్నారు. ఈ సినిమాలో మద్దిశెట్టి సామేలు కూడా కీలక పాత్రలో నటించనున్నారు. రియల్ స్టార్ హీరో అప్సర్ ఆజాద్ తమ్ముడి పాత్రలో మద్దిశెట్టి సామేలు కనిపించనున్నారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభం కానున్న సినిమా చిత్రీకరణకు సంబంధించిన లొకేషన్లు, ఇతర అంశాలపై చర్చించారు. సినీ ప్రముఖులు మద్దిశెట్టి సామేలు నివాసానికి రావడంతో అక్కడ సందడి నెలకొంది. త్వరలో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

# నవనాతపుర సిద్ధ పై గుట్టపై ప్రత్యేక పూజలు అధిక సంఖ్యలో ఉదయం నుండి భక్తులు పూజలు నిర్వహించడం జరిగింది

ఈకాలం







ఆర్మూర్ పట్టణం లో ని ఎంతో పవిత్రమైన శ్రీ నవనాథ సిద్దుల గుట్ట పైకి సోమవారం భక్తులు ఉదయం నుండి అధిక సంఖ్యలు విచ్చేసి శివాలయం లో ఆ సిద్దేశ్వర స్వామికి పంచామృతాలతో బిల్వపత్రలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులు వారికి ఒడి బియ్యం పోసి పండ్లు పూలతో అమ్మవారికి విశేషంగా పూజలు చేయడం జరిగింది. దుర్గామాత ఆలయంలో దేవి నవరాత్రుల ఉత్సవ సందర్భంగా ఆలయ మొత్తం అందంగా అలంకరించడం జరిగింది. రామాలయం దత్తాత్రేయ దుర్గామాత అయ్యప్ప ఎల్లమ్మ తల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో ఆ సిద్దేశ్వర స్వామి పల్లకి సేవ భక్తులందరి సమక్షంలో భజన మండలి వారి భక్తి గీతాలు పాడుకుంటూ రామాయణం నుండి కోనేరు వరకు వెళ్లి అక్కడ హారతి ఇచ్చి తిరిగి బ్రాహ్మణ వద్దకు చేరుకుంది పల్లకి సేవ అనంతరం విచ్చేసిన భక్తులందరికీ ఆర్మూర్ పట్టణంలోని జక్కం విజయలక్ష్మి నారాయణ కుటుంబ సభ్యులు దేశాపేట్ గ్రామానికి చెందిన విట్టల్ మాజీ సర్పంచ్ భక్తులకు అన్నప్రసధాం అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో బి సుమన్, పి సీ గంగారెడ్డి, కోడి రమణయ్య, జిమ్మీ రవి, చరణ్ రెడ్డి, బట్టు శంకర్, చంద్ర శ్రీనివాస్, నరేష్ భక్తులు మరియు భజన మండలి వారు భక్తులందరూ పాల్గొన్నారు.

# దుర్గామాత మాల ధరణ వేసుకున్న స్వాములను విధుల్లోకి అనుమతించని వరుణ్ మోటార్స్ యాజమాన్యం...

**– హిందువులపై దృష్టంగా ప్రవర్తిస్తున్న వరుణ్ మోటార్స్ యజమాన్యం**

**– ఆర్మూర్ పట్టణ బిజెపి అధ్యక్షుడు మందుల బాలు**

ఈకాలం

మాలలో వున్నా స్వాములు విషయం తెలియ పార్చాగానే హిందూ వాహిని అధ్యక్షులు మందుల బాలు అక్కడికి చేరుకొని మేనేజర్ కీ యాజమాన్యం కీ కనువిప్పు కలిగేలా మాట్లాడటం జరిగింది. అసలు మనం ఎటువంటి దీన పరిస్థితితిలలో బ్రతుకుతున్నామో అర్థం కావడం లేదు స్కూలల్లో కాలేజీ లల్లో హిందువులుగా మనం పనిచేసే ఏ చోటనైనా సరే ఎంతటి ఆంక్షలు విదిస్తున్న సిగ్గులేని వ్యవస్థలకు బుద్ధి కచ్చితంగా చెప్పాల్సిందే ఈ రోజు ఇక్కడ పనులకే రానివ్వట్లే రేపు మన గుడిలల్లోకి బడులల్లో కీ అసలు రానివ్వరు హిందూ సమాజం ఇప్పటికైనా మొద్దు నిద్రను విడకపోతే మన భావితరాలకు బానిసత్వని మిగిలించిన వల్లమావుతాం ఇది నిజంగా సిగ్గుతో తల నరుకున్నే పరిస్థితి కనీసం మన పరిసరాల్లో ఒకరికి ఏ ఆపద వచ్చిన మనం ఒకటి కాకపోతే మనల్ని ఆ భగవంతుడు కూడా కాపాడలేడు. . సమస్య పరిష్కారానికి సహకరించిన హిందూవాహిని సభ్యులకు స్వాముల తరుపున ధన్యవాదములు మాతో పాటు బీజేవైఎం జిల్లా



అధ్యక్షులు వంశీ జక్రాన్ పల్లి బీజేపీ అధ్యక్షులు కి హిందూవాహిని సభ్యులు ఉదయ్, మనీష్, సాయి, ప్రశాంత్, మాలధారణ స్వాములు ఆర్గుల్ జక్రాన్ పల్లి యూవత పాల్గొన్నారు.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149